


Registered No : APTEL/25/A0818

# ఇది కద నిజం

సామాన్యుని సమస్యలపై నిత్యం పోరాడే ఆయుధంగా.. జాతీయ తెలుగు దిన పత్రిక



శుక్రవారం 11-09-2026 | పేజీలు : 4 | వెల : 2/- | సంపుటి :2 | సంచిక :85 | www.edikadanijam.com | ఎడిటర్ : బాలరాజ్ గౌడ్

## మంత్రుల వద్ద పనులు కావట్లే!



2 లో

- వందల లెటర్లు.. చర్యలు మాత్రం శూన్యం
- ఎమ్మెల్యేల సిఫారసులకు విలువ లేదా?
- అధికారులు, మంత్రులు పట్టించుకోవడం లేదంటూ ఆవేదన
- నియోజకవర్గాల్లో అభివృద్ధి పనులకు బ్రేక్
- ప్రజలకు సమాధానం చెప్పలేకపోతున్నాం
- ఎమ్మెల్యేల లెటర్లపై స్పీకర్ జోక్యం కోరుతూ విజ్ఞప్తి
- మంత్రులకు స్పీకర్ ఆదేశాలివ్వాలంటూ డిమాండ్

## కర్ణాటకలో వందేమాతరం కొత్త రూల్

- తొలి రెండు చరణాలకే పరిమితం
- కేంద్ర నిర్ణయానికి భిన్నంగా వైఖరి
- అధికారిక వేడుకల్లో ఇదే విధానం
- కాంగ్రెస్ 1937 నిర్ణయమే ఆధారం
- పూర్తి గీతంపై కేంద్రం ఆదేశాలు
- ఖర్గే వ్యాఖ్యలపై బీజేపీ విమర్శలు
- వందేమాతరంపై మళ్లీ రాజకీయ వేడి



**న్యూస్ డెస్క్, 10 సెప్టెంబరు (ఇది కద నిజం):** 'వందేమాతరం' జాతీయ గీతం విషయంలో కర్ణాటక కాంగ్రెస్ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్ర ప్రభుత్వ కార్యక్రమాలు, అధికారిక వేడుకల్లో వందేమాతరం తొలి రెండు చరణాలను మాత్రమే పాడాలని ఉత్తర్వులు జారీ చేసింది. వివిధ ప్రభుత్వ కార్యక్రమాల్లో జాతీయ గీతాన్ని పాడే సమయంలో ఏకరూపత, గౌరవం, సరైన ప్రోటోకాల్ పాటించాల్సిన అవసరం ఉందని ప్రభుత్వం పేర్కొంది.

కర్ణాటక ప్రభుత్వం జారీ చేసిన కన్నడ ఉత్తర్వుల అనువాదం ప్రకారం.. కేంద్ర హోంశాఖ 'వందేమాతరం' అధికారిక వెర్షన్, ప్రభుత్వ, ప్రజా కార్యక్రమాల్లో దాని గానం లేదా ప్రదర్శనకు సంబంధించి మార్గదర్శకాలను జారీ చేసిందని తెలిపింది. అయితే రాష్ట్రంలో జరిగే కార్యక్రమాల స్వభావం, సందర్భానికి అనుగుణంగా గీతాన్ని పాడే విషయంలో ఏకరూపత, గౌరవం, సరైన ప్రోటోకాల్ ఉండేలా ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొంది.

2 లో

## భారత్-చైనా మధ్య కొత్త అధ్యాయం?

- ఏడేళ్ల తర్వాత భారత్‌లో జిన్‌పింగ్ అడుగు
- భారత్-చైనా బంధాల్లో కీలక మలుపు
- బ్రిక్స్ వేదికగా మోదీ--జిన్‌పింగ్ భేటీ?
- గల్వాన్ తర్వాత మళ్లీ దౌత్యానికి ఊపు
- ఎల్‌ఏసీ శాంతిపై కీలక చర్చలకు ఛాన్స్
- వాణిజ్య వ్యత్యాసాలపైనా అధినేతల చర్చలు
- భారత్ వేదికగా 20 ఏళ్ల బ్రిక్స్ వేడుక
- 11 దేశాలతో విస్తరించిన బ్రిక్స్ కూటమి

2 లో

## ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులపై బీజేపీ తీర్మానం

- 5 లక్షల మంది ఉద్యోగుల సమస్యలు
- సకాలంలో అందని జీతాలు
- కుటుంబాల్లో ఆర్థిక ఇబ్బందులు
- ఔట్‌సోర్సింగ్ కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి
- దళారుల దోపిడీకి చెక్ పెట్టాలి
- ఉద్యోగులకు భద్రత కల్పించాలి
- అసెంబ్లీలో ప్రత్యేక చర్చకు డిమాండ్



**న్యూస్ డెస్క్, 10 సెప్టెంబరు (ఇది కద నిజం):** తెలంగాణ శాసనసభలో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలపై తక్షణమే చర్చ చేపట్టాలని డిమాండ్ చేస్తూ సిర్పూర్ నియోజకవర్గ ఎమ్మెల్యే డాక్టర్ పాల్వాయి హరీశ్ బాబు వాయిదా తీర్మానం ఇచ్చారు. అసెంబ్లీ కార్యవిధాన, కార్యక్రమ నిర్వహణ నియమావళిలోని 63వ నిబంధన కింద సభా కార్యక్రమాలను వాయిదా వేసి, ఈ అత్యవసర ప్రజా ప్రాముఖ్యత కలిగిన అంశం పై సమగ్ర చర్చ జరపాలని ఆయన శాసనసభ కార్యదర్శి కి లిఖితపూర్వక నోటీసు సమర్పించారు. రాష్ట్రంలో పనిచేస్తున్న దాదాపు 5 లక్షల మంది ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు సకాలంలో వేతనాలు అందక వారి కుటుంబాలు తీవ్ర ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్నాయని ఆయన సభ దృష్టికి తీసుకువచ్చారు.

2 లో

## ట్రాన్స్‌జెండర్లకు రాజకీయ వేదిక!

- ఇక మున్సిపాలిటీల్లో కో-ఆప్షన్ మెంబర్లు
- చట్ట సవరణ బిల్లు ప్రవేశపెట్టిన శ్రీధర్‌బాబు
- పట్టణ పాలనలో ట్రాన్స్‌జెండర్లకు భాగస్వామ్యం
- వారి సమస్యలకు ఇక ప్రత్యక్ష వేదిక
- వెనుకబడిన వర్గాలకు పాలనలో చోటు
- మున్సిపల్ పాలనలో కీలక సంస్కరణ
- ట్రాన్స్‌జెండర్ల ప్రాతినిధ్యానికి తెలంగాణ కొత్త అడుగు


2 లో

## అమెరికాలోనూ ఉచిత హామీలే!

- రిపబ్లికన్లను గెలిపిస్తే రూ.4.15 లక్షలు!
- ప్రతి అమెరికన్ ఖాతాలో 5 వేల డాలర్లు
- మిడ్‌టర్మ్ ఎన్నికల వేళ ట్రంప్ భారీ హామీ
- ట్రంప్ హామీకి నిధులు ఎక్కడి నుంచి?
- రూ.83 లక్షల కోట్లకు పైగా ఆర్థిక భారం
- భారీ నగదు పంపిణీతో ద్రవ్యోల్బణం భయం
- డోజ్ డివిడెండ్.. టారిఫ్ రిఫండ్ తర్వాత మరో హామీ

2 లో

## పింఛన్ కోసం మరో ఛాన్స్!



2 లో

**న్యూస్ డెస్క్, 10 సెప్టెంబరు (ఇది కద నిజం):** అర్హులైన దివ్యాంగుల నుంచి పింఛన్ కోసం ప్రభుత్వం దరఖాస్తులు స్వీకరిస్తోందని ఈ దరఖాస్తులకు సెప్టెంబర్ 15 చివరి తేదీ అని మంత్రి సీతక్క వెల్లడించారు.

## రేవంత్‌పై సభాహక్కుల నోటీస్!



2 లో

- నకిలీ పోస్టుపై అభ్యంతరం
- కేసీఆర్ ప్రతిష్ఠకు భంగమంటూ ఆరోపణ
- 'అంతర్జాతీయ కార్యదర్శి' వ్యాఖ్యలపై అభ్యంతరం
- ఫేక్ ఖాతా ఆధారంగా సభలో ప్రసంగం
- అసెంబ్లీని తప్పుదోవ పట్టించారంటూ ఫైర్
- రేవంత్‌పై చర్యలకు డిమాండ్



# అసెంబ్లీ గేటు కేసుల వేట!

**న్యూస్ డెస్క్, 10 సెప్టెంబరు (ఇది కద నిజం):** తెలంగాణ అసెంబ్లీ వద్ద బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, పోలీసుల మధ్య జరిగిన ఘర్షణకు సంబంధించి మరో కీలక పరిణామం చోటుచేసుకుంది. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావు సహా నలుగురు నేతలపై సైఫాబాద్ పోలీసులు కేసు నమోదు చేశారు. అసెంబ్లీ గేట్ నంబర్ 3 వద్ద విధులు నిర్వహిస్తున్న సమయంలో తమ పట్ల అనుచితంగా ప్రవర్తించారని.. దూషణలు, బెదిరింపులకు పాల్పడ్డారని ఆరోపిస్తూ ఓ మహిళా కానిస్టేబుల్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఈ కేసు నమోదైంది. ఈ కేసులో కేటీఆర్, హరీశ్‌రావుతో పాటు బీఆర్ఎస్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి, ఎమ్మెల్సీ నవీన్‌రెడ్డిలను నిందితులుగా చేర్చినట్లు పోలీసులు తెలిపారు. భారతీయ న్యాయ సంహిత (బీఎన్‌ఎస్)లోని పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

మిగతాది 2 లో..

- కేటీఆర్, హరీశ్‌లపై కేసు
- మహిళా కానిస్టేబుల్ ఫిర్యాదు
- నలుగురిపై పోలీసుల ఎఫ్ఐఆర్
- అసెంబ్లీ గేటు వద్ద ఉద్రిక్తత
- మహిళా పోలీసులతో అనుచిత ప్రవర్తన?
- దూషణలు.. బెదిరింపుల ఆరోపణలు
- బీఎన్ఎస్‌లో పలు సెక్షన్లు
- సీసీ కెమెరాలపై పోలీసుల ఫోకస్
- ఆధారాల సేకరణలో పోలీసులు

## ఆధారాలతో బయటపెడతా

- మెగా డీఎస్సీపై జగన్ ప్రశ్నలు
- 372 పోస్టుల భర్తీపై అనుమానాలు
- ఫస్ట్ ర్యాంకర్‌కు ఉద్యోగం ఎందుకు?
- జీఓలు మార్చడంపై నిలదీత
- నకిలీ సర్టిఫికెట్లతో ఉద్యోగాలా?
- స్పోర్ట్స్ కోటాపై ఆరోపణలు
- చంద్రబాబు, లోకేష్‌పై ఫైర్
- ఆధారాలు బయటపెడతానన్న జగన్



**న్యూస్ డెస్క్, 10 సెప్టెంబరు (ఇది కద నిజం):** మెగా డీఎస్సీపై రాష్ట్ర ప్రభుత్వం తన తప్పుల్ని కప్పిపుచ్చుకునే ప్రయత్నం చేస్తోందని వైఎస్సార్సీపీ అధినేత జగన్ ఆరోపించారు. మెగా డీఎస్సీ నియామకాల్లో అనేక అవకతవకలు జరిగాయని ఆయన ఆరోపించారు. మెగా డీఎస్సీపై అసెంబ్లీ వేదికగా చంద్రబాబు, లోకేష్ అబద్ధాలు చెప్పారని దుయ్యబట్టారు.

"ప్రశ్నపత్రాల తయారీ, పరీక్షల నిర్వహణ ఒక్కరికే ఎందుకు?

SCERT విభాగంలో పనిచేసే నవీన్ కి ఫస్ట్ ర్యాంక్ ఎలా?

2 లో

## 18 గంటల కష్టం.. ఎవరి లాభం?

- సోదరుల షెల్ కంపెనీల కోసమా?
- రూ.200 కోట్ల భూమిపై ప్రశ్నలు
- అసెంబ్లీలో ప్రశ్నిస్తే సస్పెన్షన్
- ఇజ్రాయెల్ కంపెనీలతో లావాదేవీలు
- భూకేటాయింపులపై కేటీఆర్ ఫైర్
- నిరుద్యోగులకు హామీలు ఏమయ్యాయి?
- ఈడీ, సీబీఐ విచారణకు డిమాండ్



**న్యూస్ డెస్క్, 10 సెప్టెంబరు (ఇది కద నిజం):** సీఎం రేవంత్ రెడ్డి సోదరుడి షెల్ కంపెనీకి నిబంధనలకు విరుద్ధంగా విలువైన భూములను కేటాయించారని, ఈ భూదోపిడీపై అసెంబ్లీలో నిలదీసినందుకే తమను సభ నుంచి సస్పెండ్ చేశారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. గురువారం నేరుగా ఆ వివాదాస్పద భూ కేటాయింపు స్థలాన్ని సందర్శించిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. రోజుకు 18 గంటలు పనిచేస్తున్నానని నిత్యం గొప్పలు చెప్పుకునే సీఎం రేవంత్ రెడ్డి, అసలు ఆ సమయమంతా ఎవరి కోసం కేటాయిస్తున్నారని ప్రశ్నించారు. ఆ 18 గంటల కష్టం తెలంగాణ ప్రజల కోసమా లేక తన స్వంత సోదరులు, వారి బినామీ షెల్ కంపెనీల లబ్ధి కోసమా అని నిలదీశారు..

2 లో

# పింఛన్ కోసం మరో ఛాన్స్!

మొదటి పేజీ తరువాయి

రాష్ట్రంలో 4,66,351 మంది దివ్యాంగులు పింఛన్ పొందుతున్నారని తెలిపారు. ఇప్పటి వరకు దివ్యాంగుల కేటగిరీ కింద 1,23,199 దరఖాస్తులు వచ్చాయని ఈ దరఖాస్తులను క్షేత్రస్థాయి పరిశీలన తర్వాత అర్హత గలవారికి పింఛన్ల పంపిణీ చేస్తామన్నారు. గురువారం శాసనమండలిలో ప్రశ్నోత్తరాల సమయంలో సభ్యులు అడిగిన ప్రశ్నలకు సమాధానం ఇచ్చిన మంత్రి.. తాము వచ్చా తల సేమియా పేషంట్లకు పింఛన్లు ఇచ్చే కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రారంభించారని వెల్లడించారు. సదరం సర్టిఫికేషన్లు రెన్యువల్ చేసుకోకపోవడం వల్లే కొందరికి పింఛన్లు రావడం లేదన్నారు. అర్హత కలిగిన వారు తమ సదరం సర్టిఫికేట్లు రెన్యువల్ చేసుకోవాలని సూచించారు. అర్హులైన అందరికీ పింఛన్లు ఇస్తున్నామన్నారు.

# భారత్-చైనా మధ్య కొత్త అధ్యాయం?



న్యూస్ డెస్క్, 10 సెప్టెంబరు (ఇది కద నిజం): 18వ బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సులో పాల్గొనేందుకు చైనా అధ్యక్షుడు జిన్ పింగ్ భారత్‌లో పర్యటించే అవకాశం ఉంది. 2026 సెప్టెంబర్ 12-13 తేదీల్లో న్యూఢిల్లీలోని భారత్ మండపంలో ఈ సదస్సు జరగనుంది. ఈ పర్యటన ఖరారైతే, 2019లో జరిగిన మామల్లపురం అనధికారిక సమ్మిట్ తర్వాత, ఏడేళ్ల వ్యవధిలో ఆయన భారత్‌కు రావడం ఇదే తొలిసారి కానుంది. 2020లో తూర్పు లడఖ్‌లోని గల్వాన్ లోయలో జరిగిన సరిహద్దు ఘర్షణల తర్వాత భారత్- చైనా సంబంధాలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. అయితే, ఇటీవల ఇరుదేశాల మధ్య దౌత్య, సైనిక స్థాయి చర్చల ద్వారా సంబంధాలు మెరుగుపడుతున్న నేపథ్యంలో జిన్ పింగ్ రాక ప్రాధాన్యత సంతరించుకుంది.

భారత్‌లో బ్రిక్స్-2026 సదస్సు ప్రత్యేకం..

బ్రిక్స్ కూటమికి భారత్ అధ్యక్షత వహించడం ఇది నాల్గవసారి (గతంలో 2012, 2016, 2021లలో వహించింది. 2026 నాటికి బ్రిక్స్ కూటమి ఏర్పడి 20 ఏళ్లు పూర్తి కావడంతో ఈ సదస్సు ప్రత్యేకత సంతరించుకుంది. "నిలకడ, వినూత్నత, సహకారం, సుస్థిరత కోసం నిర్మాణం" అనే ఇతివృత్తంతో, "మానవత్వమే ప్రథమం" అనే విస్తృత దృక్పథంతో ఈ సదస్సు జరగనుంది. బ్రెజిల్, రష్యా, ఇండియా, చైనా, దక్షిణాఫ్రికా సభ్యులుగా ఉన్న ఈ కూటమిలో ఈజిప్ట్, ఇథియోపియా, ఇరాన్, యూఏఈ, సౌదీ అరేబియా, ఇండోనేషియా చేరడంతో సభ్యుల సంఖ్య 11కి చేరింది.

జిన్ పింగ్ పర్యటన ప్రాముఖ్యత..

ఈ సదస్సు సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, చైనా అధ్యక్షుడు జిన్ పింగ్ మధ్య ద్వైపాక్షిక చర్చలు జరిగే అవకాశం ఉంది. ఎల్ఏసీ రేఖ వద్ద శాంతిభద్రతల పునరుద్ధరణ, వాణిజ్య వ్యత్యాసాల తగ్గింపు, ఆర్థిక లావాదేవీలు, అంతర్జాతీయ వేదికలపై గ్లోబల్ సౌత్ (అభివృద్ధి చెందుతున్న దేశాల) ప్రయోజనాల పరిరక్షణ వంటి అంశాలపై ఇరు దేశాల అధినేతలు చర్చించే అవకాశం ఉంది.

# మంత్రుల వద్ద పనులు కావట్లే!

న్యూస్ డెస్క్, 10 సెప్టెంబరు (ఇది కద నిజం): తెలంగాణ శాసనసభ వేదికగా మంత్రుల వైఖరిపై శాసనసభ్యులు తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేస్తున్నారు. నియోజకవర్గాల పరిధిలోని అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారం కోసం వందల సంఖ్యలో సిఫారసు లేఖలు (లెటర్లు) ఇస్తున్నప్పటికీ, మంత్రుల వద్ద పనులు కావడం లేదని ఎమ్మెల్యేలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తాము ఇచ్చే లేఖలపై అధికారులు గానీ, మంత్రులు గానీ ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని సభ దృష్టికి తీసుకొచ్చారు. "వందల సంఖ్యలో లెటర్లు ఇస్తున్నాం.. కానీ అవన్నీ ఎక్కడికి వెళ్తున్నాయో, అసలు ఏం జరుగుతుందో అర్థం కావడం లేదు" అని సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వంలో పనులు ఎక్కడికక్కడ నిలిచిపోయాయని, అభివృద్ధి ప్రక్రియ అంగుళం కూడా ముందుకు సాగడం లేదని ఆరోపించారు.

ఈ నేపథ్యంలో నియోజకవర్గ ప్రజలకు తాము సమాధానం చెప్పలేకపోతున్నామని ఎమ్మెల్యేలు పేర్కొన్నారు. తమ ప్రాతినిధ్య హక్కులను కాపాడాలని, ఎమ్మెల్యేల లెటర్లపై ప్రత్యేకంగా దృష్టి సారించేలా స్పీకర్ కలుగజేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. నియోజకవర్గాల్లో పనులు సాగకి ఎదుర్కొంటున్న సమస్యలకు, ఎమ్మెల్యేల వేదనకు స్పీకరే బాధ్యత వహించి మంత్రులకు తగిన ఆదేశాలు ఇవ్వాలని కోరారు.

# ఆధారాలతో బయటపెడతా: జగన్!


మొదటి పేజీ తరువాయి

ఫస్ట్ ర్యాంక్ వచ్చిన నవీన్ కి ఎందుకు ఉద్యోగం ఇవ్వలేదు? స్పోర్ట్స్ కోటా జీవోను మార్చేసి 372 పోస్టుల భర్తీ ఎందుకు?" అని వరుస ప్రశ్నలు సంధించారు. పరీక్షలు పెట్టకుండానే 372 మందికి ఉద్యోగాలు కట్టబెట్టారని జగన్ ఆరోపించారు.

జీవో నంబర్ 4, జీవో నెంబర్ 47ను ఎందుకు తీసుకొచ్చారని నిలదీశారు. నకిలీ సర్టిఫికెట్లతో స్పోర్ట్స్ కోటాలో ఉద్యోగాలిచ్చారని, జూడో అనే ఆట కింద 39 మందికి పోస్టులు ఇచ్చారని ఆరోపించారు. పోటీలు జరగకున్నా జరిగినట్లుగా సర్టిఫికెట్లు సృష్టించారు.

డీఎస్సీ అక్రమాలపై తాము వేస్తున్న ప్రశ్నలకు ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి లోకేష్ సమాధానం చెప్పలేకపోతున్నారని జగన్ విమర్శించారు. అక్రమాలను ప్రశ్నించిన జర్నలిస్టులపై, ప్రతిపక్షాలపై తప్పుడు కేసులు పెట్టి భయపెట్టే ప్రయత్నం చేస్తున్నారని, ప్రజాస్వామ్యబద్ధంగా వచ్చే ప్రశ్నలను బుల్డోజ్ చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. చంద్రబాబు చేసిన స్కాముల హిస్టరీలోనే ఈ డీఎస్సీ స్కామ్ ఒక ఆణిముత్యం లాంటిదని ఎద్దేవా చేశారు. తన కొడుకును కాపాడుకునేందుకే చంద్రబాబు తాపత్రయపడుతున్నారని, ఆధారాలు చూపిస్తుంటే ఆయనకు బీపీ పెరుగుతోందని జగన్ అన్నారు. మెగా డీఎస్సీ నియామకాలు సక్రమంగానే జరిగితే.. ఫస్ట్ ర్యాంకర్ కోర్టుకు ఎందుకు వెళ్లాడని నిలదీశారు. ఈ స్కామ్‌పై ఆధారాలు నివ్వెరపోయేలా ఉన్నాయని, త్వరలోనే వీటన్నింటినీ ప్రజల ముందు ఉంచుతానని స్పష్టం చేశారు.

# ట్రాన్స్‌జెండర్లకు రాజకీయ వేదిక!



న్యూస్ డెస్క్, 10 సెప్టెంబరు (ఇది కద నిజం): తెలంగాణ శాసనసభలో మున్సిపాలిటీల చట్ట సవరణ బిల్లును మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు గురువారం ప్రవేశపెట్టారు. పట్టణ స్థానిక సంస్థల్లో ట్రాన్స్‌జెండర్లకు తగిన సామాజిక ప్రాతినిధ్యం, రాజకీయ వేదిక కల్పించడమే లక్ష్యంగా రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఈ చారిత్రాత్మక నిర్ణయం తీసుకుంది. రాష్ట్రంలోని మున్సిపల్ కార్పొరేషన్లు, మున్సిపాలిటీల్లో కో-ఆప్షన్ సభ్యులుగా ట్రాన్స్‌జెండర్ల ను నియమించుకునేలా చట్టంలో వెసులుబాటు కల్పించనున్నారు. అణగారిన వర్గాలు, సంచార జాతులతో పాటు సమాజంలో వెనుకబడిన ట్రాన్స్‌జెండర్ కమ్యూనిటీకి పాలనాపరమైన నిర్ణయాల్లో భాగస్వామ్యం కల్పించడం ఈ బిల్లు ప్రధాన లక్ష్యమని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి.

స్థానిక సంస్థల సమావేశాల్లో కో-ఆప్షన్ సభ్యులుగా ట్రాన్స్‌జెండర్లు భాగస్వాములు అవ్వడం ద్వారా వారి సమస్యలను నేరుగా ప్రభుత్వ, అధికారుల దృష్టికి తీసుకువెళ్లే అవకాశం లభిస్తుంది. సమాజంలో ఏ వర్గం కూడా వెనుకబడి ఉండకూడదనే ఉద్దేశంతో ప్రభుత్వం ఈ మున్సిపల్ చట్ట సవరణకు శ్రీకారం చుట్టింది. ఈ నిర్ణయం ద్వారా దేశవ్యాప్తంగా ట్రాన్స్‌జెండర్ల సంక్షేమానికి పాటుపడుతున్న రాష్ట్రాల జాబితాలో తెలంగాణ ముందు వరుసలో నిలిచింది. ఈ బిల్లు ద్వారా మున్సిపల్ పాలనలో సరికొత్త సంస్కరణలకు శ్రీకారం చుట్టినట్లయింది. సభలో ఈ బిల్లుపై చర్చ అనంతరం దీనికి సంబంధించిన మార్గదర్శకాలు పూర్తిస్థాయిలో అమలుల్లోకి రానున్నాయి.

# అమెరికాలోనూ ఉచిత హామీలే!




న్యూస్ డెస్క్, 10 సెప్టెంబరు (ఇది కద నిజం): రెండవసారి అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన కొత్తలో ఎలాన్ మస్క్ ఆధ్వర్యంలోని 'డోజ్' టీమ్ ద్వారా కేంద్ర బడ్జెట్‌లో ఆదా చేసే సొమ్మును అమెరికన్లకు పంచుతానని అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ 'డోజ్ డివిడెండ్' పేరిట హామీ ఇచ్చారు. ఆ తర్వాత విదేశీ వస్తువులపై విధించే దిగుమతి సుంకాల నుంచి వచ్చే ఆదాయాన్ని ప్రజలకు 'టారిఫ్ రిఫండ్' రూపంలో ఇస్తామని ప్రకటించారు. కానీ ఆ రెండు ప్రతిపాదనలు ఆచరణలోకి రాలేదు.

అయినప్పటికీ, అమెరికన్ల ఖాతాల్లో వేలాది డాలర్ల నగదు జమ చేస్తామంటూ ట్రంప్ మరోసారి పెద్ద హామీని తెరపైకి తెచ్చారు. డల్లాస్‌లో జరిగిన రిపబ్లికన్ మిడ్‌టర్మ్ సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రాబోయే నవంబర్ మధ్యంతర ఎన్నికల్లో పార్లమెంట్ నియంత్రణను రిపబ్లికన్లు నిలుపుకుంటే ప్రతి అమెరికన్ కు 5,000 (సుమారు రూ.4.15 లక్షలు) ఇస్తామని హామీ ఇచ్చారు. అయితే ఈ పథకానికి నిధులు ఎలా సమకూరుస్తారనే దానిపై ట్రంప్ ఎటువంటి స్పష్టత ఇవ్వలేదు. ఇదివరకు ఇచ్చిన రెండు హామీల తరహాలోనే కాంగ్రెస్‌లోని రిపబ్లికన్లు ఈ కొత్త ప్రతిపాదనను కూడా పక్కనబెట్టే అవకాశం ఉందని నిపుణులు భావిస్తున్నారు.

**భారీ ఆర్థిక భారం.. ద్రవ్యోల్బణం భయం:**

ప్రతి పౌరుడికి 5,000 ఇవ్వాలంటే ప్రభుత్వానికి దాదాపు 1 ట్రిలియన్ (రూ.83 లక్షల కోట్లకు పైగా) ఉమ్మడి ఖర్చు అవుతుంది. అర్హత నిబంధనలను బట్టి ఈ వ్యయం మారినప్పటికీ, ఇంత భారీ మొత్తాన్ని పంపిణీ చేయడం వల్ల దేశంలో ద్రవ్యోల్బణం మళ్లీ తీవ్రమయ్యే ప్రమాదం ఉందనే ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. మస్క్ ఆధ్వర్యంలోని డిపార్ట్‌మెంట్ ఆఫ్ గవర్నమెంట్ ఎఫిషియెన్సీ అనుకున్నంత స్థాయిలో నిధులు ఆదా చేయలేకపోవడం, ట్రంప్ విధించిన ప్రాథమిక టారిఫ్‌లలో చాలావరకు సుప్రీంకోర్టు రద్దు చేయడంతో మునుపటి పథకాలకు నిధుల కొరత ఏర్పడింది.

# రేవంత్‌పై సభాహక్కుల నోటీస్!



న్యూస్ డెస్క్, 10 సెప్టెంబరు (ఇది కద నిజం): తెలంగాణ శాసనసభలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి వ్యతిరేకంగా భారత్ రాష్ట్ర సమితి ఎమ్మెల్యేలు సభాహక్కుల ఉల్లంఘన (ప్రివిలేజ్ మోషన్) నోటీస్ ఇచ్చారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు లక్ష్మారెడ్డి, మహిపాల్ రెడ్డి తదితరులు అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌ను కలిసి ఈ మేరకు ఫిర్యాదు సమర్పించారు. శాసనసభ వేదికగా బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రతిష్ఠకు భంగం కలిగించేలా సీఎం రేవంత్‌రెడ్డి ఒక నకిలీ సోషల్ మీడియా పోస్టును ప్రస్తావించారని విపక్ష నేతలు ఆరోపించారు.

అసెంబ్లీలో మాట్లాడిన సీఎం రేవంత్ రెడ్డి, బీఆర్ఎస్ 'అంతర్జాతీయ కార్యదర్శి' అని ఉటంకిస్తూ కేసీఆర్‌పై తీవ్ర వ్యాఖ్యలు చేశారు. బీఆర్ఎస్ పార్టీకి అంతర్జాతీయ కార్యదర్శి అనే పదవే లేదని, సంధ్యారావు అనే వ్యక్తికి పార్టీతో ఎలాంటి సంబంధం లేదని ఎమ్మెల్యేలు స్పష్టం చేశారు. కాంగ్రెస్ ఐటీ సెల్ సృష్టించిన నకిలీ ఖాతా ఆధారంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడారని మండిపడ్డారు. బాధ్యతాయుతమైన సీఎం హోదాలో ఉన్న రేవంత్ రెడ్డి, నిజా నిజాలు పరిశీలించకుండా నకిలీ పోస్టుతో అసెంబ్లీని, రాష్ట్ర ప్రజలను తప్పుదోవ పట్టించారని బీఆర్ఎస్ నేతలు ఆరోపించారు. అత్యున్నతమైన శాసనసభ గౌరవాన్ని తగ్గించేలా నకిలీ ఖాతాల ప్రచారాన్ని వేదికగా చేసుకున్నందున సీఎం రేవంత్ రెడ్డిపై సభాహక్కుల ఉల్లంఘన కింద చర్యలు తీసుకోవాలని బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు స్పీకర్‌ను కోరారు.

# 18 గంటల కష్టం.. ఎవరి లాభం?

మొదటి పేజీ తరువాయి

రాష్ట్రంలో కేవలం రూ.లక్ష మూలధనంతో స్టార్టప్ ప్రారంభించే ఏ నిరుద్యోగ యువకుడికైనా కాంగ్రెస్ ప్రభుత్వం రూ.200 కోట్ల విలువైన ఐదెకరాల భూమిని ఇలాగే కట్టబెడుతుందా అని కేటీఆర్ సూటిగా ప్రశ్నించారు. ఓవైపు కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ కేంద్ర ప్రభుత్వంపై విమర్శలు గుప్పిస్తూ ఇజ్రాయెల్‌తో వ్యాపార సంబంధాలపై ప్రధాని మోదీని ప్రశ్నిస్తుంటే, మరోవైపు తెలంగాణలోని కాంగ్రెస్ ప్రభుత్వమే నేరుగా ఇజ్రాయెల్ కంపెనీలతో లావాదేవీలు నడుపుతోందని కేటీఆర్ ధ్వజమెత్తారు. సీఎం రేవంత్ రెడ్డి సోదరుడు అనుముల కొండల్ రెడ్డి ఇజ్రాయెల్ ఇన్నోవేషన్ సంస్థతో భాగస్వామ్యం కుదుర్చుకుని ఏరోస్పేస్, డిఫెన్స్ వెంచర్ పేరిట ఖరీదైన భూములు కొల్లగొట్టారని ఆరోపించారు

. సీఎం సోదరుల జేబులు నింపడమే కాంగ్రెస్ చెబుతున్న 'ఇందిరమ్మ రాజ్యం' పాలసీయా అని నిప్పులు చెరిగారు. అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లో నెలకు రూ.4,000 పింఛన్, మహిళలకు రూ.2,500, నిరుద్యోగులకు రూ.4,000 భృతి ఇస్తామని చెప్పి ప్రజలకు మొండిచేయి చూపారని, కానీ సీఎం నిరుద్యోగ సోదరులకు మాత్రం అద్భుతమైన ఉపాధితో పాటు వందల కోట్ల భూములు దక్కుతున్నాయని ఎద్దేవా చేశారు. కేంద్రంలోని బీజేపీకి నిజాయితీ ఉంటే ఈ మొత్తం షెల్ కంపెనీల భూ కుంభకోణంపై తక్షణమే ఈడీ, సీబీఐ, ఐటీ శాఖలతో సమగ్ర విచారణ జరిపించి వాస్తవాలను వెలికి తీయాలని ఆయన డిమాండ్ చేశారు.

# చంద్రబాబుకు గురుదక్షిణ చెల్లిస్తుండ్రా సీఎం రేవంత్‌పై హరీశ్‌రావు ఫైర్



న్యూస్ డెస్క్, 10 సెప్టెంబరు (ఇది కద నిజం): దేశమంతా ఎల్‌నినో ప్రభావం ఉన్న ఈ తరుణంలో చుక్కచుక్క నీటిని ఒడిసిపట్టాల్సిన అవసరం ఉందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. గురువారం ఆయన తెలంగాణ భవన్‌లో కృష్ణా జలాలపై మాట్లాడుతూ.. రాష్ట్రంలో పంట పొలాలు ఎండుతుంటే, కృష్ణా జలాలను దుర్మార్గంగా, నిర్లక్ష్యంగా ఏపీకి వదులుతున్నారని ఆయన తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. కళ్లముందే నీళ్లు పారుతున్నా ప్రజలకు ఇవ్వలేని పాలన సాగుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు.

మార్షల్స్‌ను పెట్టి మమ్మల్ని ఎత్తుడు కాదు.. నదిలో నీళ్లను ఎత్తు

పాలమూరుపై సీఎం రేవంత్‌రెడ్డికి ఉన్న ప్రేమ ఏంటో అర్థమైందని హరీశ్‌రావు ఎద్దేవా చేశారు. ఏపీ సీఎం చంద్రబాబు కు గురుదక్షిణ చెల్లించేందుకే కాంగ్రెస్ ప్రభుత్వం ఇలాంటి చర్యలకు పాల్పడుతోందని ఆరోపించారు. నికర జలాలు లేని వెలగొండకు ఏపీ నీళ్లు ఎత్తుకెళ్తోందని, నికర జలాల కేటాయింపు ఉన్న బీమా మోటార్లు మాత్రం ఎందుకు నడపడం లేదని సీఎం రేవంత్‌ను ఆయన సూటిగా ప్రశ్నించారు. కల్వకుర్తిలో మూడు మోటార్లు ఎందుకు బంద్ పెట్టారంటూ నిలదీశారు. అయితే, ఈ అంశంపై సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి తనతో చర్చకు వస్తారా అని హరీశ్‌రావు సవాల్ విసిరారు. అసెంబ్లీలో మార్షల్స్‌ను పెట్టి మమ్మల్ని ఎత్తేయడం కాదు.. నదిలో నీళ్లను ఎత్తుకెళ్లకుండా అడ్డుకోవాలని రేవంత్‌రెడ్డిపై ఫైర్ అయ్యారు. తెలంగాణ రైతాంగ ప్రయోజనాలను తాకట్టు పెడుతున్న కాంగ్రెస్ ప్రభుత్వ తీరుపై రైతులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారని హరీశ్ రావు పేర్కొన్నారు.

# ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులపై బీజేపీ తీర్మానం




న్యూస్ డెస్క్, 10 సెప్టెంబరు (ఇది కద నిజం): తెలంగాణ శాసనసభలో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలపై తక్షణమే చర్చ చేపట్టాలని డిమాండ్ చేస్తూ సిర్పూర్ నియోజకవర్గ ఎమ్మెల్యే డాక్టర్ పాల్వాయి హరీశ్ బాబు వాయిదా తీర్మానం ఇచ్చారు. అసెంబ్లీ కార్యవిధాన, కార్యక్రమ నిర్వహణ నియమావళిలోని 63వ నిబంధన కింద సభా కార్యక్రమాలను వాయిదా వేసి, ఈ అత్యవసర ప్రజా ప్రాముఖ్యత కలిగిన అంశం పై సమగ్ర చర్చ జరపాలని ఆయన శాసనసభ కార్యదర్శి కి లిఖితపూర్వక నోటీసు సమర్పించారు. రాష్ట్రంలో పనిచేస్తున్న దాదాపు 5 లక్షల మంది ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు సకాలంలో వేతనాలు అందక వారి కుటుంబాలు తీవ్ర ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్నాయని ఆయన సభ దృష్టికి తీసుకువచ్చారు.

కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు తక్షణమే ప్రత్యేక 'ఔట్‌సోర్సింగ్ కార్పొరేషన్'ను ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే హరీశ్ బాబు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. దళారుల దోపిడి లేకుండా కార్పొరేషన్ ద్వారా ఉద్యోగులందరికీ పూర్తిస్థాయి ఉద్యోగ భద్రత కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని స్పష్టం చేశారు. నెలనెలా జీతాలు రాక ఇబ్బంది పడుతున్న లక్షలాది మంది ఉద్యోగుల సమస్యలను పరిష్కరించేందుకు శాసనసభలో సభను వాయిదా వేసి, దీనిపై ప్రత్యేకంగా చర్చ చేపట్టాలని ఆయన స్పీకర్‌కు విజ్ఞప్తి చేశారు.

# కర్ణాటకలో వందేమాతరం కొత్త రూల్

మొదటి పేజీ తరువాయి

**తొలి రెండు చరణాలకే పరిమితం**

కర్ణాటక ప్రభుత్వ కార్యక్రమాలు, అధికారిక వేడుకల్లో 'వందేమాతరం'లోని తొలి రెండు చరణాలను మాత్రమే పాడాలని ఉత్తర్వుల్లో స్పష్టం చేశారు. స్వాతంత్ర్యోద్యమ సమయంలో జాతీయవాదం, ఐక్యత, దేశభక్తి భావాలను పెంపొందించడంలో ఈ గీతం కీలక పాత్ర పోషించిందని ప్రభుత్వం పేర్కొంది. అయితే ఈ నిర్ణయం రాజకీయంగా మరోసారి చర్చకు దారితీసే అవకాశం ఉంది. కేంద్ర హోంశాఖ అధికారిక కార్యక్రమాల్లో పూర్తి 'వందేమాతరం' పాడాలని ఇచ్చిన ఆదేశాలకు భిన్నంగా కర్ణాటక ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకోవడం గమనార్హం.

**కేంద్రం నిర్ణయానికి భిన్నంగా కాంగ్రెస్ వైఖరి**

డీకే శివకుమార్ నేతృత్వంలోని కర్ణాటక ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం.. 'వందేమాతరం'పై కాంగ్రెస్ పార్టీ గతంలో తీసుకున్న వైఖరికి అనుగుణంగా ఉందని భావిస్తున్నారు. గత నెలలో కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ 1937లో తీసుకున్న తీర్మానాన్ని అనుసరించాలని నిర్ణయించింది. పార్టీ కార్యక్రమాల్లో వందేమాతరం తొలి రెండు చరణాలను మాత్రమే పాడాలని ఆ తీర్మానంలో పేర్కొన్నారు. ఈ నిర్ణయం మహాత్మా గాంధీ, జవహర్‌లాల్ నెహ్రూ, రవీంద్రనాథ్ ఠాగూర్, సుభాష్ చంద్రబోస్, సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ వంటి నేతల సమక్షంలో తీసుకున్నదని కాంగ్రెస్ చెబుతోంది.

**పూర్తి వందేమాతరం తప్పనిసరి చేసిన కేంద్రం**

ఇదిలా ఉంటే ఫిబ్రవరిలో కేంద్ర ప్రభుత్వం ప్రభుత్వ కార్యక్రమాలు, ప్రజా సమావేశాల్లో పూర్తి 'వందేమాతరం' పాడటాన్ని తప్పనిసరి చేసింది. జాతీయ గీతం ఆలపించడాన్ని అడ్డుకోవడం లేదా అంతరాయం కలిగించడం నేరంగా పరిగణించేలా పార్లమెంట్‌లో బిల్లును కూడా ప్రవేశపెట్టింది. దీనిపై కాంగ్రెస్ అభ్యంతరం వ్యక్తం చేసింది. 1937లో కాంగ్రెస్ అగ్రనేతలు తీసుకున్న నిర్ణయానికి అనుగుణంగానే తాము వ్యవహరిస్తున్నామని పేర్కొంది.

'అసంపూర్తి వందేమాతరం'పై ఖర్గేకు విమర్శలు

ఆగస్టులో గోవాలో జరిగిన ఓ కార్యక్రమంలో కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే 'వందేమాతరం' పూర్తి వెర్షన్‌ను పాడలేదంటూ విమర్శలు వచ్చాయి. దీనిపై బీజేపీ నేతలు కాంగ్రెస్‌పై విమర్శలు గుప్పించారు. దీనికి ఖర్గే స్పందిస్తూ.. మహాత్మా గాంధీ, నెహ్రూ, సర్దార్ పటేల్, మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయి తదితరులు పాడిన వెర్షన్‌నే తాను పాడానని చెప్పారు. అదే వెర్షన్‌ను పాడటం నేరమైతే, ఆ నేతలపై కూడా కేసులు నమోదు చేయాలని ఆయన వ్యాఖ్యానించారు.

**'వందేమాతరం' చరిత్ర ఇదీ..**

'వందేమాతరం'ను ప్రముఖ రచయిత బంకించంద్ర ఛటర్జీ తన 'ఆనందమఠం' నవలలో రచించారు. 1896లో జరిగిన కాంగ్రెస్ సమావేశంలో రవీంద్రనాథ్ ఠాగూర్ తొలిసారి వందేమాతరాన్ని ఆలపించారు. అయితే ఆ తర్వాత ముస్లిం లీగ్ నాయకులు ఈ గీతంలోని హిందూ దేవతల ప్రస్తావనలను అభ్యంతరకరంగా పేర్కొంటూ వ్యతిరేకించారు. దీంతో 1937లో కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సమావేశమై.. వందేమాతరంలోని తొలి రెండు చరణాలను మాత్రమే పాడాలని నిర్ణయించింది. ప్రస్తుతం కేంద్రం, కాంగ్రెస్ వైఖరులు భిన్నంగా ఉండటంతో కర్ణాటక ప్రభుత్వం తీసుకున్న తాజా నిర్ణయం మరోసారి రాజకీయ చర్చకు తెరతీసే అవకాశం ఉంది.

# అసెంబ్లీ గేటు.. కేసుల వేట!

మొదటి పేజీ తరువాయి

తెలంగాణ అసెంబ్లీ వర్షాకాల సమావేశాల ప్రారంభం రోజున బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు బ్లాక్ టీ షర్టులు, ప్లకార్డులతో అసెంబ్లీ వద్దకు చేరుకుని ప్రభుత్వ తీరుకు నిరసన తెలిపారు. అయితే రూల్స్ ప్రకారం బ్లాక్ టీ షర్టులు, ప్లకార్డులతో అసెంబ్లీ ప్రాంగణంలోకి అనుమతి లేదని పోలీసులు అడ్డుకున్నారు. దీంతో బీఆర్ఎస్ నేతలు, పోలీసుల మధ్య వాగ్వాదం చోటుచేసుకుని ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడ్డాయి. కొందరు నేతలు పోలీసులను తోసుకుంటూ లోపలికి వెళ్లేందుకు ప్రయత్నించారనే ఆరోపణలు వచ్చాయి. ఈ క్రమంలోనే విధుల్లో ఉన్న మహిళా పోలీసులతోనూ అనుచితంగా ప్రవర్తించారని తాజాగా ఫిర్యాదు నమోదైంది.



ఓ మహిళా కానిస్టేబుల్ ఇచ్చిన ఫిర్యాదు ప్రకారం.. విధి నిర్వహణలో ఉన్న మహిళా సిబ్బందిని బీఆర్ఎస్ నేతలు దూషించారని ఆరోపించారు. తమను అవమానించేలా మాట్లాడటంతో పాటు బెదిరింపులకు పాల్పడ్డారని ఫిర్యాదులో పేర్కొన్నట్లు సమాచారం. అలాగే కొందరు బీఆర్ఎస్ నాయకులు టీ షర్టులు విప్పేసి.. మహిళా పోలీసుల ఎదుట అర్ధనగ్నంగా నిలబడ్డారని.. దీంతో తమ విధులకు తీవ్ర ఆటంకం కలిగిందని ఆమె ఆరోపించినట్లు పోలీసులు తెలిపారు. ఈ ఘటనతో మహిళా పోలీసులకు ఇబ్బంది, మానసిక ఒత్తిడి ఏర్పడిందని ఫిర్యాదులో పేర్కొన్నట్లు సమాచారం.

అసెంబ్లీ హైడ్రామా.. బ్లాక్ టీషర్టుల్లో బీఆర్ఎస్.. హరీశ్ అరెస్ట్, కేటీఆర్‌కు గాయాలు

మహిళా కానిస్టేబుల్ ఫిర్యాదు ఆధారంగా కేటీఆర్, హరీశ్‌రావు, దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి, ఎమ్మెల్సీ నవీన్‌రెడ్డిలపై పోలీసులు కేసు నమోదు చేశారు. మహిళల గౌరవానికి భంగం కలిగించడం, ప్రభుత్వ ఉద్యోగుల విధులకు ఆటంకం కలిగించడం, దాడి, బెదిరింపులు, అసభ్య ప్రవర్తన వంటి ఆరోపణలకు సంబంధించిన బీఎన్ఎస్ సెక్షన్లను ఎఫ్ఐఆర్‌లో చేర్చినట్లు పోలీసులు వెల్లడించారు. ఈ వ్యవహారంలో బీఎన్ఎస్ 74, 75, 79, 121(1), 132, 296, 351(2), 352, 3(5) వంటి సెక్షన్లను పోలీసులు ప్రస్తావించినట్లు సమాచారం. అయితే ఎఫ్ఐఆర్‌లోని పూర్తి సెక్షన్ల వర్తింపు, దర్యాప్తు పురోగతిని బట్టి తదుపరి చర్యలు ఉండనున్నాయి.

కేసు దర్యాప్తులో భాగంగా అసెంబ్లీ గేట్ నంబర్ 3 పరిసరాల్లోని సీసీటీవీ దృశ్యాలను పోలీసులు పరిశీలించనున్నట్లు తెలుస్తోంది. ఘటనకు సంబంధించిన మీడియా వీడియోలు, ఫొటోలు, ఇతర ఆధారాలను కూడా సేకరించి ఆరోపణలపై విచారణ జరపనున్నారు. మహిళా పోలీసుల ఫిర్యాదులో పేర్కొన్న అంశాలను కూడా దర్యాప్తులో భాగంగా పోలీసులు పరిశీలించనున్నారు. ఆరోపణలు నిజమా.. ఘటనలో ఎవరెవరి పాత్ర ఉంది.. అన్న అంశాలను ఆధారాల ఆధారంగా నిర్ధారించాల్సి ఉంటుంది.

అసెంబ్లీ సమావేశాల నేపథ్యంలో అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్ఎస్ మధ్య రాజకీయ పోరు తీవ్రంగా కొనసాగుతున్న సమయంలో ఈ కేసు నమోదు కావడం ప్రాధాన్యం సంతరించుకుంది. నల్ల దుస్తులతో బీఆర్ఎస్ నేతల నిరసన, అసెంబ్లీ గేటు వద్ద పోలీసులతో వాగ్వాదం, ఆ తర్వాత చోటుచేసుకున్న పరిణామాలు ఇప్పటికే తెలంగాణ రాజకీయాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారాయి.

# వాటర్ బాటిల్ అధిక ధర.. రూ.7 లక్షలు ఫైన్!



అన్నవరం (ఇది కద నిజం)సెప్టెంబర్ :10: అన్నవరం దేవస్థానంలో రూ.18 ఎమ్మార్పీ ఉన్న వాటర్ బాటిల్‌ను రూ.25కు విక్రయించిన దుకాణదారుడికి జిల్లా వినియోగదారుల కమిషన్ రూ.7 లక్షల భారీ జరిమానా విధించింది. పిఠాపురానికి చెందిన డి. వెంకటేశ్వరరావు ఫిర్యాదుపై విచారించిన కమిషన్ ఈ మేరకు తీర్పునిచ్చింది.

ఎమ్మార్పీ కంటే అధిక ధరకు వాటర్ బాటిల్ విక్రయించడం వినియోగదారుల ప్రయోజనాలకు విరుద్ధమైన అన్యాయ వాణిజ్య పద్ధతి కింద పరిగణించబడుతుంది. వినియోగదారుల రక్షణ చట్టం, 2019లోని సెక్షన్ 2(47) లో అన్యాయ వాణిజ్య పద్ధతికి నిర్వచనం ఇవ్వగా, సెక్షన్ 39 కింద జిల్లా వినియోగదారుల కమిషన్ పరిహారం, ఖర్చులు తదితర ఉపశమనాలను ఆదేశించే అధికారం కలిగి ఉంది.

బాటిల్‌ను అదనపు ధరకు విక్రయించినందుకు ఫిర్యాదుదారునికి రూ.10 వేల పరిహారం, కేసు ఖర్చుల కింద రూ.5 వేలు, అలాగే వినియోగదారుల సంక్షేమ నిధికి రూ.7 లక్షలు 45 రోజుల్లోగా చెల్లించాలని దుకాణదారుడిని కమిషన్ ఆదేశించింది.

ఎమ్మార్పీ కంటే ఒక్క రూపాయి అధికంగా వసూలు చేసినా వినియోగదారుల హక్కుల ఉల్లంఘనగా పరిగణించబడే అవకాశం ఉందని ఈ తీర్పు స్పష్టం చేస్తోంది. ముఖ్యంగా దేవస్థానాలు, పర్యాటక ప్రాంతాలు, రైల్వే స్టేషన్లు, బస్టాండ్లు వంటి ప్రదేశాల్లో అధిక ధరలకు తాగునీరు విక్రయించే వ్యాపారులకు ఈ తీర్పు ఒక హెచ్చరికగా నిలుస్తోంది.

# దివ్యాంగ విద్యార్థులకు ఎక్స్ పోజర్ విజిట్





నల్లగొండ (ఇది కద నిజం): విద్యార్థులు కొత్త ప్రదేశాలను సందర్శించడం ద్వారా వివిధ అంశాలను ప్రత్యక్షంగా తెలుసుకొని వారిలో సామాజిక అంశాలపై అవగాహన కల్పిం చడమే ఎక్స్పోజర్ విజిట్ ప్రధాన ఉద్దేశమని యాదాద్రి భువనగిరి జిల్లా విద్యాశాఖాధికారి బొల్లారం భిక్షపతి అన్నారు... సమగ్ర శిక్ష యాదాద్రి భువనగిరి జిల్లా శాఖ ఆధ్వర్యంలో జిల్లా విద్యాశాఖ కార్యాలయం ద్వారా జిల్లాలోని అన్ని మండలాల నుండి 70మంది ప్రత్యేక అవసరాలు గల (సీడబ్ల్యు ఎస్ ఎన్) విద్యార్థులకు,36 మంది ఎస్కార్ట్ టీచర్లకు రామోజీ ఫిల్మ్ సిటీలో ఎక్స్పోజర్ విజిట్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఈవో భిక్షపతి మట్లాడుతూ... విద్యార్థులలో వివిధ అంశాల పట్ల సామాజిక అవగాహన కల్పిం చి ఆత్మ విశ్వాసం, స్వతంత్రత, సమాజంలో కలిసి మెలిసి ఉండే నైపుణ్యాలను పెంపొందించడమే ఎక్స్పోజర్ విజిట్ నిర్వహించామని అన్నారు.. సీడబ్ల్యూస్ఎన్ విద్యార్థులకు సమాన అవకాశాలు కల్పిస్తూ వారిని కూడా సమాజంలో అన్ని కార్య క్రమాల్లో భాగస్వాములు చేయడమే సమగ్ర విద్యా లక్ష్యమన్నారు. ఈ సందర్భంగా రామోజీ ఫిల్మ్ సిటీలో పార్కులు, సినిమా సెట్టింగ్ లు, షూటింగ్ విశేషాలతో పాటు విద్య, వైజ్ఞానిక అంశాలను విద్యార్థులు తిలకించారు.. .ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు భాస్కర్, షాజహాన్, జ్యోతి,సంధ్యారాణి, సుధామణి,శ్రీనివాస్, రవీందర్ రెడ్డి, రాంచందర్,కేర్ గివర్లు, విద్యార్థులు,వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.



# చాకలి ఐలమ్మ స్ఫూర్తి ఆదర్శం

నల్లగొండ (ఇది కద నిజం): తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు, వీరనారి చాకలి ఐలమ్మ పోరాట స్ఫూర్తి అందరికీ ఆదర్శం అని యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి అన్నారు.. చాకలి ఐలమ్మ వర్ధంతిని పురస్కరించుకుని... వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టరేట్ లో ఐలమ్మ వర్ధంతి వేడుకలు నిర్వహించారు.. ఈ కార్యక్రమం లో జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి , స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్ రావు, రెవిన్యూ అదనపు కలెక్టర్ వెంకా రెడ్డి తో కలిసి చాకలి ఐలమ్మ చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ భూమి కోసం, భుక్తి కోసం, వెట్టి చాకిరి విముక్తి కోసం జరిగిన తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటానికి స్ఫూర్తినిచ్చిన చాకలి ఐలమ్మ సేవలు మరువలేనివి అని అన్నారు. తొలి భూ పోరాటానికి నాంది పలికిన వీరమాత చాకలి ఐలమ్మను ఆదర్శంగా తీసుకుని, ఆమె ఆశయాల సాధనకు కృషిచేయాలని పిలుపునిచ్చారు. ఆమె ధీర చరిత్ర ప్రపంచవ్యాప్తంగా ప్రాచుర్యం పొంది ప్రజా పోరాటాలకు స్ఫూర్తిగా నిలిచిందన్నారు. ఈ కార్యక్రమం జిల్లా వెనుకబడిన తరగతుల అధికారి సుబ్బారెడ్డి వివిధ కుల సంఘాల నాయకులు, కలెక్టరేట్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# బీఆర్ఎస్ కుట్రలను బలంగా తిప్పికొట్టాలి : సీఎల్పీ భేటీలో సీఎం రేవంత్



హైదరాబాద్,ఇది కద నిజం: రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయాలు, అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఎమ్మెల్యేలకు తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి దిశానిర్దేశం చేశారు. అసెంబ్లీ కమిటీ హాల్‌లో సీఎం అధ్యక్షతన సీఎల్పీ భేటీ జరిగింది. ఈ సమావేశంలో సీఎం పలు సూచనలు చేశారు.

“వెయ్యి రోజుల పాలనను ప్రజలకు వివరించాలని అసెంబ్లీ సమావేశాలు నిర్వహిస్తున్నాం. సభ జరగనివ్వకుండా ప్రధాన ప్రతిపక్షం బీఆర్ఎస్ కుట్ర చేసింది. ఆ పార్టీకి అధికారం పోయినా అహంకారం పోలేదు. పోలీసులు, ప్రజాప్రతినిధులను దూషించి సభను సజావుగా జరగకుండా చేశారు. మహిళా అధికారుల ముందు టీషర్టులు విప్పి ఇబ్బంది కలిగించారు. స్పీకర్‌ను అత్యంత అభ్యంతరకరంగా దూషించారు. ప్రతిపక్షం కుట్రలను బలంగా తిప్పికొట్టాలి. ప్రభుత్వంపై జరిగిన కుట్రను ప్రజల్లోకి తీసుకెళ్లిన వారిని అభినందిస్తున్నా. ఎమ్మెల్యేలు సభకు హాజరై చర్చల్లో పాల్గొనాలి” అని రేవంత్ దిశానిర్దేశం చేశారు.

# సెప్టెంబర్ 12న జాతీయ లోక్ అదాలత్

**● ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా పరిధిలో 44 బెంచిల ఏర్పాటు**

**● జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ శ్రీ జునైద్ అహ్మద్ మౌలానా**



రాజమహేంద్రవరం (ఇది కద నిజం) సెప్టెంబర్ 10: ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా పరిధిలోని తూర్పు గోదావరి, కాకినాడ, కోనసీమ, పోలవరం జిల్లాల్లో మొత్తం 44 బెంచిలలో సెప్టెంబర్ 12న జాతీయ లోక్ అదాలత్ నిర్వహించనున్నట్లు జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ శ్రీ జునైద్ అహ్మద్ మౌలానా గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.

జాతీయ లోక్ అదాలత్‌కు సంబంధించిన అవగాహన సామగ్రిని మంత్రిత్వ శాఖలు, ప్రభుత్వ విభాగాలు, ఇతర భాగస్వాముల వెబ్‌సైట్లు, డిజిటల్ ప్లాట్‌ఫారమ్‌ల ద్వారా ప్రజలకు విస్తృతంగా చేరేలా ప్రచారం చేయనున్నట్లు తెలిపారు. లోక్ అదాలత్ ఉద్దేశం, ప్రయోజనాలు, పరిష్కరించుకోగల వివాదాలపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు న్యాయ సేవా సంస్థలు చర్యలు చేపడుతున్నాయని పేర్కొన్నారు.

న్యాయ సేవాధికార సంస్థల చట్టం, 1987 ప్రకారం ప్రజలకు న్యాయ ప్రాప్యతను ప్రోత్సహించడంతో పాటు న్యాయ సేవలు, వివాద పరిష్కార యంత్రాంగాలపై అవగాహన కల్పించేందుకు జాతీయ న్యాయ సేవాధికార సంస్థ (నల్సా) వివిధ కార్యక్రమాలను చేపడుతోందన్నారు. ఈ వ్యవస్థలో లోక్ అదాలత్‌లు కీలకమైన భాగంగా ఉన్నాయని తెలిపారు.

లోక్ అదాలత్‌ల ద్వారా వివాదాలను పరస్పర అంగీకారంతో, స్నేహపూర్వక వాతావరణంలో పరిష్కరించుకునే అవకాశం ఉంటుందని, సులభంగా అందుబాటులో ఉండే, వేగవంతమైన, తక్కువ ఖర్చుతో కూడిన వివాద పరిష్కార వేదికగా ఇవి ఉపయోగపడతాయని వివరించారు.

సెప్టెంబర్ 12న నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్‌ను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని, పరిష్కరించదగిన వివాదాలను పరస్పర అంగీకారంతో పరిష్కరించుకునేందుకు ముందుకు రావాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి శ్రీ జునైద్ అహ్మద్ మౌలానా సూచించారు.

# జిల్లాలో పెండింగ్ లో ఉన్న భూసేకరణ పనులను వేగవంతం చేయాలి



నల్లగొండ (ఇది కద నిజం): జిల్లాలో పెండింగ్ ఉన్న భూసేకరణ మరియు ఆర్ అండ్ ఆర్ పనులను త్వరతగతిన పూర్తి చేయాలని సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ అధికారులను ఆదేశించారు. జిల్లా కలెక్టరేట్ లో భూ సేకరణ పనుల పై ఇరిగేషన్, ఆర్ అండ్ బి, ఆర్ డబ్ల్యూ ఎస్, ఎండోన్మెంట్, పంచాయతీరాజ్ వివిధ శాఖల పనుల పురోగతి పై కలెక్టర్ సమీక్ష నిర్వహిస్తూ, పెండింగ్ లో ఉన్న ప్రాజెక్టుల భూసేకరణ వెంటనే పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.. భూసేకరణ లో జాప్యం వల్ల ప్రాజెక్టుల పనులు నిలిచిపోయి వాటి నిర్మాణ వ్యయం కూడా రోజు రోజుకూ పెరిగిపోతుందని అన్నారు.. ఏమైనా సమస్యలు ఉంటే తక్షణం తన దృష్టికి తీసుకువచ్చి వాటిని పరిష్కరిస్తూ పనులు వేగవంతం చేయాలని సూచించారు..

# స్థానిక సంస్థల ఎన్నికలలో వైఎస్ఆర్సిపి గెలుపే లక్ష్యం..!!


**● ఎంపీ అవినాష్ రెడ్డి వెల్లడి.**



ఇది కద నిజం న్యూస్ కడపజిల్లా సెప్టెంబర్ 09: కడప నగరంలోని ఐఎంఏ హాల్ లో మాజీ ముఖ్యమంత్రి, జననేత వైయస్ జగన్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు కడపజిల్లా అధ్యక్షులు బి. రవీంద్రనాథ్ రెడ్డి ఆధ్వర్యంలో మరియు మాజీ డిప్యూటీ సీఎం, కడప నియోజకవర్గ సమన్వయకర్త ఎస్.బి. అంజద్ బాషా అధ్యక్షతన నియోజకవర్గ విస్తృత సమావేశం అత్యంత విజయవంతంగా నిర్వహించబడింది. ఈ సమావేశంలో వైఎస్ఆర్సిపి నాయకులు మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం చేస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలు, అక్రమాలపై మరియు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో విఫలమవ్వడంపై తీవ్ర స్థాయిలో చర్చించడం జరిగింది. అలాగే వైఎస్ఆర్సిపి కార్యకర్తలు, నాయకులపై బనాయిస్తున్న అక్రమ కేసులను ధీటుగా ఎదుర్కొంటూ, రాబోయే రోజుల్లో వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ జెండాను మళ్లీ సగర్వంగా ఎగరవేయడమే లక్ష్యంగా ముందుకు సాగాలని నాయకులు కార్యకర్తలు ఉద్దేశించి పిలుపునిచ్చారు. అనంతరం ఎంపీ అవినాష్ రెడ్డి మాట్లాడుతూ.. స్థానిక సంస్థల ఎన్నికల్లో వైసీపీ గెలుపే లక్ష్యంగా పెట్టుకోవాలని, తార తమ్యాలు లేకుండా ప్రతి ఒక్కరూ పార్టీ కోసం కృషి చేయాలన్నారు. కూటమి ప్రభుత్వం అవినీతి, అక్రమాలపై పోరాటానికి సిద్ధం కావాలన్నారు. నాయకులు మరియు కార్యకర్తల పైన ఎన్ని కేసులు నమోదైన, ఇతరాత్ర ఇబ్బందులు ఎదురైనా కడప కార్పొరేషన్ వైసిపి ఖాతాలో ఉండాలన్నారు. ప్రస్తుత పరిస్థితులలో

టీడీపీ నే రాజకీయ ప్రత్యర్థిగా గుర్తుంచుకోవాల్సిన అవసరం ఉందన్నారు. పార్టీలో చిన్న,చిన్న మనస్పర్థలను పక్కనపెట్టి సమష్టిగా పనిచేయాలి, రానున్న రోజుల్లో వైసీపీ నేతలకు అందించిన ఐడి కార్డులను చూసి గౌరవం ఇచ్చే కాలం మును ముందు ఉంది అంటూనే, తెలుగుదేశం పార్టీ వెన్నుపోటు పార్టీ, వెన్నుపోటు పాలన అనే నినాదంతో పోస్టర్ల తో కార్యకర్తల సమావేశంలో అవినాష్ రెడ్డి మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు రవీంద్రనాథ్ రెడ్డి, ఎంపీ వైఎస్. అవినాష్ రెడ్డి, ఎస్ బి. అంజద్ బాషా, కె. సురేష్ బాబు, రామచంద్రారెడ్డి, గురు మోహన్, సుబ్బారెడ్డి డాక్టర్ సోహైల్, పాకా సురేష్, నిత్యానందరెడ్డి, పులి సునీల్ కుమార్, తెలుగుపులి వెంకటసుబ్బమ్మ, దీప్తి రెడ్డి, మరియు పలువురు జిల్లా, నగర అనుబంధ సంఘాల నాయకులు, నాయకురాళు ,, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# శ్రీ సరస్వతీ విద్యాపీఠం సేవలకు ఇన్ఫోసిస్ ప్రతిష్టాత్మక పురస్కారం




విద్యా సేవ విభాగంలో ప్రతిష్టాత్మక ఇన్ఫోసిస్ నుంచి శ్రీ సరస్వతీ విద్య పీఠం సహ కార్యదర్శి నిమిషకవి వేంకట కాశీ విశ్వేశ్వరరావు మరియు అర్ధ చంద్ర ప్రకాష్ రెడ్డిలు ఇన్ఫోసిస్ సంస్థ నుంచి ప్రతిష్టాత్మక పురస్కారాన్ని అందుకున్నారు. పూణేలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో వారికి ఈ అవార్డును ప్రదానం చేశారు. విద్యా రంగంలో అందిస్తున్న నిరంతర సేవలు, దూరదృష్టితో కూడిన నాయకత్వం మరియు విద్యాభారతి ఉద్యమ విస్తరణకు వారు చేసిన నిరంతర కృషికి గుర్తింపుగా ఈ అవార్డు లభించింది. విద్యా వ్యవస్థను మరింత బలోపేతం చేసేందుకు, సమాజంలో నాణ్యమైన విద్యను అందించేందుకు వారు చేసిన సేవలు శ్లాఘనీయమని పేర్కొన్నారు.

ఈ సందర్భంగా నిమిషకవి వేంకట కాశీ విశ్వేశ్వరరావు, అర్ధ చంద్ర ప్రకాష్ రెడ్డిలకు విద్యాభారతి కుటుంబ సభ్యులు హృదయపూర్వక అభినందనలు తెలియజేశారు. విద్యా రంగానికి శ్రీ సరస్వతీ విద్యాపీఠం అందిస్తున్న సేవలు, అసమాన కృషికి ఈ పురస్కారం తగిన గుర్తింపు అని కొనియాడారు. ఈ పురస్కారాన్ని అందుకోవడం పట్ల పలువురు విద్యావేత్తలు, సంస్థ సభ్యులు సంతోషం వ్యక్తం చేస్తూ, ముున్ముందు కూడా విద్యా రంగానికి వారు మరిన్ని సేవలందించాలని ఆకాంక్షించారు.

# నేడువైస్సార్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశం



ఉమ్మడి నెల్లూరు జిల్లా వెంకటగిరి(ఇది కద నిజం):-నేడు అనగా11-09-2026వతేది శు క్రవారం ఉదయం తొమ్మిది గంటలకు వెంకటగిరి నియోజకవర్గ వైస్సార్ కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త నేదురుమల్లి రాంకుమార్ రెడ్డి ఆధ్వర్యంలో వెంకటగిరి పట్టణంలోని స్థానిక యన్.జె.ఆర్.బంగ్లాలో జరిగే వైస్సార్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ స్థాయి సమావేశం జరగనుంది.కాబట్టి వెంకటగిరి నియోజకవర్గ పరిధిలోని వెంకటగిరి పట్టణం, వెంకటగిరి రూరల్, బాలయపల్లి, డక్కిలి, సైదాపురం, రాపూరు, కలువాయి మండలాల వైస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు,వైస్సార్ కాంగ్రెస్ పార్టీ అభిమానులు,ప్రజలు ప్రతి ఒక్కరూ హాజరు అవ్వాలని వెంకటగిరి నియోజకవర్గ వైస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయం నుండి ప్రకటనలో తెలిపారు.

# సీఎంను కలిస్తే కాంప్రమైజ్.. లేకపోతే గ్యాప్ అంటారు: రాజగోపాల్‌రెడ్డి



హైదరాబాద్: నిధుల కోసం సీఎం రేవంత్ ను కలిస్తే తప్పేంటని మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి ప్రశ్నించారు. నియోజకవర్గ అభివృద్ధి జరగాలంటే సీఎం, డిప్యూటీ సీఎంను కలవాల్సిందేనని చెప్పారు. సీఎంతో తనకు అభిప్రాయబేధాలు మాత్రమే ఉన్నాయన్నారు. మంచి జరిగితే మంచి.. చెడు జరిగితే చెడు అని చెప్పడం తన నైజమన్నారు. మీడియాతో రాజగోపాల్‌రెడ్డి చిట్‌చాట్ నిర్వహించారు.

“సీఎం రేవంత్, నేను ఎప్పుడూ తిట్టుకోవాలని కొందరు చూస్తున్నారు. మంత్రి పదవి కోసం సీఎం దగ్గర రాజీపడినట్లు ప్రచారం చేస్తున్నారు. మంత్రి పదవి ఇచ్చేది అధిష్ఠానం. ఆ పదవి ఇస్తానని హైకమాండ్ మాటిచ్చింది. అధిష్ఠానం ఏం చెబితే అది చేయడానికి సిద్ధంగా ఉన్నా. సీఎంను కలిస్తే కాంప్రమైజ్.. కలవకపోతే గ్యాప్ పెరిగిందని ప్రచారం చేస్తారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో భిన్నాభిప్రాయాలు ఉండటం సహజం. కొండా సురేఖ విషయంలో అధిష్ఠానానికి సీఎం రేవంత్ చెప్పడంలో తప్పేమీ లేదు. ఇందిరమ్మ ఇళ్లకు ఇచ్చే రూ.ఐదు లక్షలు చిన్నమొత్తమేమీ కాదు” అని రాజగోపాల్‌రెడ్డి వ్యాఖ్యానించారు.




# ప్రభాస్‌తో చైతూ క్లాష్?

అక్కినేని నాగ చైతన్య, మీనాక్షి చౌదరి జంటగా నటిస్తున్న మిస్టికల్ థ్రిల్లర్ ‘వృషకర్మ’. ‘విరూపాక్ష’ ఫేమ్ కార్తీక్ వర్మ దండు దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ సినిమాను శ్రీ వెంకటేశ్వర సినీ చిత్ర బ్యానర్‌పై బీవీఎస్ఎన్ ప్రసాద్, సుకుమార్ సంయుక్తంగా నిర్మిస్తున్నారు. ప్రస్తుతం చిత్రీకరణ ముగింపు దశలో ఉన్న ఈ సినిమాకు సంబంధించి తాజాగా మేకర్స్ కీలక అప్‌డేట్ ఇచ్చారు. వృషకర్మ మూవీ విడుదల తేదీని ఈరోజు సాయంత్రం ప్రకటించనున్నట్లు మేకర్స్ వెల్లడించారు.

ఇప్పటికే వృషకర్మను డిసెంబర్‌లో విడుదల చేసేందుకు చిత్రబృందం సన్నాహాలు చేస్తున్నట్లు టాక్ వినిపిస్తోంది. డిసెంబర్ 3న ప్రేక్షకుల ముందుకు వచ్చే అవకాశం ఉందని ప్రస్తుతం ఇండస్ట్రీ వర్గాల్లో ఓ న్యూస్ చక్కర్లు కొడుతోంది. ఒకవేళ ఇదే నిజమైతే.. రెబల్ స్టార్ ప్రభాస్‌ను నాగ చైతన్య ఢీకొట్టనున్నాడు. డిసెంబర్ 3న ‘ఫౌజీ’ కూడా ప్రేక్షకుల ముందుకు రానుంది. దాంతో బాక్సాఫీస్ పోటీ మరింత ఆసక్తికరంగా మారనుంది. ఫౌజీ, వృషకర్మ సినిమాల రిలీజ్ డేట్స్‌పై ఇప్పుడు సినీ వర్గాల్లో చర్చ మొదలైంది.

వృషకర్మలో జయరామ్‌తో పాటు ‘లాపతా లేడీస్’ ఫేమ్ స్పర్శ్ శ్రీవాస్తవ కీలక పాత్రలో నటిస్తున్నారు. స్పర్శ్ శ్రీవాస్తవ ఈ సినిమాతో టాలీవుడ్‌లోకి అడుగుపెడుతున్నారు. ఆయన ఈ చిత్రంలో విలన్ పాత్రలో కనిపించనున్నట్లు సమాచారం.బి. అజనీష్ లోక్‌నాథ్ సంగీతం అందిస్తున్నారు. ఈ మిస్టిక్ హారర్ థ్రిల్లర్‌లో నాగ చైతన్య నిధి అన్వేషకుడిగా కనిపించనున్నాడు. విరూపాక్షతో హారర్, మిస్టరీ జానర్‌లో తనదైన ముద్ర వేసిన కార్తీక్ దండు.. వృషకర్మతో ఎలాంటి థ్రిల్‌ను అందిస్తారనే ఆసక్తి ప్రేక్షకుల్లో నెలకొంది. మరి ఈరోజు సాయంత్రం మేకర్స్ ప్రకటించబోయే రిలీజ్ డేట్ ఏంటో చూడాలి.



# ఒకే ఏడాది 3 సినిమాలు

సూర్య మామూలు జోరు చూపించడం లేదుగా.. కరుప్పు, విశ్వనాథ్ అండ్ సన్స్‌తో బ్యాక్ టు బ్యాక్ హిట్స్ కొట్టిన నడిపిన్ నాయగన్.. హ్యాట్రిక్ కోసం ప్లాన్ చేస్తున్నాడు. ఎక్స్ పరిమెంట్స్, మేకోవర్స్ చెప్పుకోవడానికే తప్ప కాసులు కురిపించవని కంగువా, రెట్రో చిత్రాలతో సూర్యకు అర్థమైంది. దీంతో తనపై ప్రయోగాలు చేసుకోవడం మానేసి కథల సెలక్షన్స్‌లో డిఫరెన్స్ చూపిస్తున్నాడు. అలాగే కమర్షియల్ యాంగిల్ మిస్ కాకుండా కేర్ తీసుకుంటున్నాడు. ఈ ఫార్ములా వర్కౌటై కరుప్పు అండ్ విశ్వనాథ్ అండ్ సన్స్‌తో బ్యాక్ టు బ్యాక్ హిట్స్ అందుకున్నాడు.

ఈ సక్సెస్ ఎంజాయ్ చేస్తూనే హ్యాట్రిక్ హిట్ కోసం ప్లాన్ చేసుకుంటున్నాడు. సూర్య 47 టైటిల్ అండ్ రిలీజ్ డేట్ లాక్ చేసుకుంది. సీన్‌గా తెరకెక్కుతోన్న ఈ మూవీ నవంబర్ బరిలో దిగుతోంది. దీపావళికి కానుకంగా నవంబర్ 6న రిలీజ్ కాబోతోంది ఫిల్మ్. ఇందులో సూర్య డిఫరెంట్ గెటప్స్‌లో కనిపిస్తున్నాడు. ఆవేశం ఫేమ్ జీతూ మాధవన్ డైరెక్టర్. నజ్రియా నజీమ్ హీరోయిన్. ప్రేమలు హీరో నస్లేన్ కీ రోల్ ప్లే చేస్తున్నాడు. కరుప్పు, విశ్వనాథ్ అండ్ సన్స్‌తో బ్లాక్ బస్టర్స్ నమోదు చేసిన సూర్య.. సీన్ మూవీతో హ్యాట్రిక్ హిట్ కొడితే ఈ తరం హీరోల్లో విజయ్ సేతుపతి తర్వాత ఒకే ఏడాదిలో ఈ ఫీట్ చేసిన హీరోగా మారతాడు. అలాగే సీన్ మూవీ 200 కోట్లు కొల్లగొడితే.. కోలీవుడ్ చరిత్రలోనే ఈ మార్క్ టచ్ అందుకున్న ఫస్ట్ హీరోగా రికార్డ్ క్రియేట్ చేస్తాడు. అంతేకాదు.. తమిళ్, తెలుగు, మలయాళ దర్శకుడితో హ్యాట్రిక్ నమోదు చేసిన తొలి తమిళ్ హీరో కూడా అతడే అవుతాడు. సూర్య ఈ రికార్డ్స్ సూర్య క్రియేట్ చేస్తాడో లేదో దీపావళికి తేలిపోనుంది.




# కొత్త కోడలు.. మంత్రగత్తెనా?

బాలీవుడ్ నటి యామీ గౌతమ్ ధర్, ఆదినాథ్ కోఠారే ప్రధాన పాత్రల్లో నటిస్తున్న తాజా హిందీ చిత్రం ‘నయీ నవేలి’ టీజర్ తాజాగా విడుదలైంది. హర్రర్, కామెడీ, మిస్టరీ అంశాల కలబోతగా ఫాంటసీ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా వస్తున్న ఈ చిత్రానికి బాలాజీ మోహన్ దర్శకత్వం వహిస్తున్నారు. ప్రముఖ దర్శక-నిర్మాత ఆనంద్ ఎల్ రాయ్, హిమాన్షు శర్మ సంయుక్తంగా కలర్ ఎల్లో ప్రొడక్షన్స్, అమెజాన్ ఎమ్‌జీఎం స్టూడియోస్ బ్యానర్లపై ఈ సినిమాను నిర్మిస్తుండగా, జీవీ ప్రకాష్ కుమార్ సంగీతం అందిస్తున్నారు.

మీరట్ నేపథ్యంలో సాగే ఓ విలక్షణ కుటుంబంలోకి అడుగుపెట్టే కొత్త కోడలు పాత్రలో యామీ గౌతమ్ నటిస్తున్నారు. ఆమె రాకతో ఆ ఇంట్లో చోటుచేసుకునే వింత సంఘటనలు, కొత్త కోడలు ఒక మంత్రగత్తె అయి ఉండొచ్చనే అనుమానాలు టీజర్‌లో ఆసక్తికరంగా చూపించారు. ‘తను వెడ్స్ మను రిటర్న్స్’ తరహా వినోదం, ‘తుంబాడ్’ మిస్టరీ కలగలిపిన సరికొత్త అనుభూతిని ఈ సినిమా ఇవ్వనుందని మేకర్స్ తెలిపారు. ఈ చిత్రం దసరా కానుకగా అక్టోబర్ 16న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో గ్రాండ్‌గా విడుదల కానుంది.







# ‘418’ సెన్సార్ పూర్తి!

అగ్ర దర్శకుడు ప్రశాంత్ నీల్ సమర్పిస్తున్న తొలి హర్రర్ థ్రిల్లర్ సినిమా ‘418’. కన్నడ దర్శకుడు కీర్తన్ నడగౌడ దర్శకత్వం వహించిన ఈ చిత్రాన్ని మైత్రీ మూవీ మేకర్స్ పతాకంపై నిర్మించారు. చాలా రోజుల నుంచి సెన్సార్ సమస్యలు ఎదుర్కొంటున్న ఈ చిత్రం ఎట్టకేలకు సెన్సార్ కార్యక్రమాలను పూర్తి చేసుకుంది.

సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఫిల్మ్ సర్టిఫికేషన్ ఈ చిత్రానికి ‘ఏ’ సర్టిఫికేట్ జారీ చేసింది. భయానక హర్రర్ అంశాలతో తెరకెక్కిన ఈ సినిమాతో ప్రేక్షకులకు అసలైన భయం ఏంటో చూపించబోతున్నామని మేకర్స్ ధీమా వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటివరకు హర్రర్ సినిమాలను చూసి నవ్వుకున్నది చాలు.. ఇక భయపడే సమయం వచ్చింది అంటూ చిత్ర యూనిట్ పేర్కొంది. సూర్య రాజ్, చరణ్ లక్కరాజు, ప్రీతి పగడాల ప్రధాన పాత్రల్లో నటిస్తున్న ఈ సినిమాకు దినేష్ దివాకర్ సినిమాటోగ్రఫీ అందిస్తున్నారు. సంచలన విషయాలతో కూడిన ఈ భయానక చిత్రం సెప్టెంబర్ 18న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో గ్రాండ్‌గా విడుదల కానుంది.

# గోవిందుడిగా రవిమోహన్!

టాలీవుడ్ రాకింగ్ స్టార్ మంచు మనోజ్ హీరోగా తెరకెక్కుతున్న తాజా చిత్రం ‘వడ్డీ కాసులవాడ’. తేజ్ ఉప్పలపాటి దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాను ఎకే ఎంటర్‌టైన్‌మెంట్స్, ఏటీవీ ఒరిజినల్స్ బ్యానర్లపై రామబ్రహ్మం సుంకర నిర్మిస్తున్నారు. ఈ చిత్రానికి సంబంధించి మేకర్స్ ఒక ఆసక్తికరమైన అప్‌డేట్‌ను విడుదల చేశారు. ఈ సినిమాలో కీలక పాత్రలో నటిస్తున్న జయరవి బర్త్‌డే నేడు. ఈ సందర్భంగా మూవీ నుంచి ఫస్ట్ లుక్‌ను పంచుకున్నారు.




ప్రతి ఒక్కరి హృదయాల్లో కొలువై ఉండే శ్రీ గోవిందుడి (శ్రీనివాసుడి) దివ్య పాత్రలో నటిస్తున్న రవిమోహన్‌కు చిత్ర యూనిట్ జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తూ ఆయన ఫస్ట్ లుక్‌ను లాంచ్ చేసింది. ఈ ప్రత్యేకమైన ప్రాజెక్ట్‌లోకి ఆయనను స్వాగతించడం చాలా సంతోషంగా ఉందని మేకర్స్ పేర్కొంటూ ‘ఓం నమో వేంకటేశాయ’ అంటూ బర్త్‌డే విషెస్ తెలిపారు. ఈ చిత్రానికి ప్రసాద్ మూరెళ్ల సినిమాటోగ్రఫీ అందిస్తుండగా, ఆర్ట్ కొల్లా ఆర్ట్ డైరెక్టర్‌గా వ్యవహరిస్తున్నారు. అలాగే కో-ప్రొడ్యూసర్లుగా దయా పన్నెం, అజయ్ సుంకర, కిషోర్ గరికపాటి బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. వైవిధ్యమైన కథాంశంతో రూపుదిద్దుకుంటున్న ఈ పాన్-ఇండియా చిత్రంపై ప్రస్తుతం ప్రేక్షకుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి.